ఎన్డీఎస్ఏ కాదది.. ఎన్డీఏ నివేదిక

ఎన్డీఎస్ఏ నివేదికను ఎల్ అండ్ టీ సంస్థ తిరస్కరించడం ఆ పార్టీలకు చెంపపెట్టు

అశాస్త్రీయ పద్ధతుల్లో రిపోర్ట్ ఇచ్చిందని బీఆర్ఎస్ చేస్తున్న వాదనే నిజమైంది

కాంగ్రెస్, బీజేపీవే చీప్ పాలిటిక్స్ • రైతులకు సీఎం క్షమాపణ చెప్పాలి: కేటీఆర్

మేడిగడ్డ బరాజ్‌పై ఎన్డీఎస్ఏ నివేదిక బూటకమని బీఆర్ఎస్ చెప్తున్న మాటే అక్షరాలా నిజమన్న సంగతి ఎల్అండ్‌టీ తాజా నిర్ణయంతో ప్రజలకు తెలిసింది. ఓ నీచమైన ఊహ ఆధారంగా క్రూరమైన రాజకీయ ఎజెండాతో ఢిల్లీలోని కాంగ్రెస్, బీజేపీ కేంద్ర కార్యాలయాల్లో ఆ రిపోర్ట్‌ను తయారు చేసింద్రు. -కేటీఆర్

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు చీప్ క్వాలిటీది కాదని, తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ చేస్తున్నవే చీప్ పాలిటిక్స్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కనీస పరీక్షలు చేయకుండా, ఎలాంటి శాస్త్రీయ డాటాను సేకరించకుండానే రూపొందించిన ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) నివేదికను ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్ అండ్‌టీ తిరస్కరించడమే ఇందుకు సాక్ష్యమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను బద్నాం చేయడానికే కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్డీఎస్ఏ ఓ అశాస్త్రీయ నివేదిక ఇచ్చిందన్న నిజం మరోసారి ప్రపంచానికి తెలిసిందని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌పై బురదజల్లేందుకు కుట్రలు చేసిన కాంగ్రెస్-బీజేపీ, ఇటీవల బీఆర్ఎస్ రజతోత్సవ సభను దెబ్బతీయాలన్న కుతంత్రాలతోనే తుది నివేదిక పేరిట నయా డ్రామాకు తెరలేపాయని మండిపడ్డారు. తప్పుల తడక నివేదికతో కాళేశ్వరంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు.

ఎన్డీఎఎస్ నివేదిక బూటకం

మేడిగడ్డ బరాజ్‌పై ఎన్డీఎస్ఏ నివేదిక బూటకమని బీఆర్ఎస్ చెప్తున్న మాటే అక్షరాలా నిజమన్న సంగతి ఎల్అండ్‌టీ నిర్ణయంతో ప్రజలకు తెలిసిందని కేటీఆర్ పేర్కొన్నారు. క్రూరమైన రాజకీయ ఎజెండాతో ఢిల్లీలోని కాంగ్రెస్, బీజేపీ కేంద్ర కార్యాలయాల్లో ఆ రిపోర్ట్‌ను తయారుచేశారని ఆరోపించారు. ఎన్డీఎస్ఏ నివేదికను ఎన్డీఏ నివేదిక అని పిలవడంలో తప్పులేదని పేర్కొన్నారు. పనికిరాని రిపోర్టును ప్రామాణికమని రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం వారి చేతకానితనానికి, దివాలాకోరు విధానాలకు నిదర్శనమని మండిపడ్డారు. కేసీఆర్‌కు పేరొస్తుందని కాళేశ్వరాన్ని పక్కనపెట్టి రేవంత్ క్షమించరాని పాపం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయలే

క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండానే ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికను ఎల్అండ్‌టీ తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టు అని కేటీఆర్ పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయినా శరవేగంగా పునరుద్ధరించిన సంగతి మరిచిపోయి, మేడిగడ్డ విషయంలో 18 నెలలుగా ప్రాజెక్టునే కోల్డ్ స్టోరేజీలోకి నెట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రాజెక్టు ప్రణాళికల నుంచి నిర్మాణం వరకు నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా కట్టిన కాళేశ్వరంపై బురదజల్లడం మాని, ఇకనైనా ఎల్అండ్‌టీ అభ్యంతరాలకు ప్రభుత్వం, ఎన్డీఎస్ఏ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రేవంత్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

ఎన్డీఎస్ఏ వాదనలన్నీ తప్పుల తడక అని తేలిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇకనైనా పోలవరం తరహాలో మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణ చర్యలు చేపట్టి తెలంగాణ రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలని సూచించారు. లేకుంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రితోపాటు కాంగ్రెస్-బీజేపీ చేస్తున్న కుట్ర రాజకీయాలకు తెలంగాణ రైతులు గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఎవరు ఎన్ని కుట్ర సిద్ధాంతాలను సృష్టించినా వాస్తవం మాత్రం చెక్కు చెదరకుండా ఉంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవనాడి అని, రాష్ట్రానికి కేసీఆర్ దార్శనికుడని కేటీఆర్ స్పష్టంచేశారు.

> కేసీఆర్‌కు పేరొస్తుందనే రాజకీయ దుగ్ధతోనే ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరాన్ని పక్కనపెట్టి సీఎం రేవంత్ క్షమించరాని పాపం చేసిండు. ముఖ్యమంత్రి నిర్వాకంతో ఏడాదిన్నరగా రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి, 500 మంది కిపైగా అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నరు. -కేటీఆర్

మేడిగడ్డపై కొత్త నాటకం!

మొదటిపేజీ తరువాయి...

రేవంత్ సహా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ చెప్తున్న మాటలివి! ఇంజినీర్లు కాకపోవచ్చు గాని నాలుగు కోట్ల ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని విచక్షణతో తెలివైన, కీలక పాలసీ నిర్ణయాలు తీసుకోవాల్సిన కుర్చీలో కూర్చున్నారన్న విషయాన్ని సైతం వారు మరిచినట్టున్నారు. ఏడాన్నరగా స్వార్థ రాజకీయాలనే తప్ప ప్రజా శ్రేయస్సును పట్టించుకున్న పాపాన పోవడం లేదు. అందుకే రెండు సీజన్లలో నీటిని ఎత్తిపోయకుండా లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండబెట్టారు. దిగువన ఆంధ్రప్రదేశ్ మరోవైపు ఢిల్లీ ప్రభుత్వం గోదావరి జలాలపై కుట్రలు పన్నుతుంటే వాటికి ఆజ్యం పోసేలా ప్రాణహిత జలాలను కిందికి వదులుతున్నారు. వానకాలం మొదలు కావడంతో మరో సంవత్సరం కూడా మేడిగడ్డ పునరుద్ధరణ అనుమానమేనని తెలుస్తున్నది. బీఆర్ఎస్ రజతోత్సవ జోష్‌ను పక్కదారి పట్టించేందుకో! మరేదైనా కారణమో గానీ ఎట్టకేలకు ఎన్డీఎస్ఏ గత నెల 24న తుది నివేదిక ఇచ్చింది. అది ప్రభుత్వానికి చేరి నెల దాటింది. ఏడాదిన్నరపాటు శోధించిన కేంద్ర సంస్థ ఏం జరిగిందో చెప్పింది కానీ, ఏం చేయాలో చెప్పిందా?! చెప్తే ప్రభుత్వం తదుపరి ఎలాంటి చర్యలు తీసుకున్నది? అసలు మేడిగడ్డపై ఎలా ముందుకు పోవాలనే దానిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓ దిశానిర్దేశం ఉన్నదా? సర్కారు మాట దేవుడెరుగు.. కేంద్ర సంస్థ ఎన్డీఎస్ఏకైనా ఒక స్పష్టత ఉన్నదా? ఇవన్నీ డొల్ల వాదనలే! ఏడాదిన్నర పాటు కేంద్రం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న హైడ్రామాలేనని తేలిపోయింది. మేడిగడ్డపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక మేడిపండు! పునరుద్ధరణకు ఏం చేయాలో మీరే చెప్పండంటూ బంతిని ఎల్అండ్‌టీ సర్కారు కోర్టులోకి నెట్టింది. దీంతో ఏం చేయాలో పాలుపోక ప్రజలకు ఏం సమాధానం చెప్పాలో తెలియక రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సెకండాఫ్ డ్రామాకు తెరలేపింది. పునరుద్ధరణ కోసమంటూ మరో కమిటీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. ఆ ప్రతిపాదనలకు రేపోమాపో గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనున్నది. ఈ నేపథ్యంలో అసలు ఎన్డీఎస్ఏ తేల్చనిది ఏమిటి? ఇప్పుడు ఈ కొత్త కమిటీ తేల్చేదేమిటి? ఇంకెన్నాళ్లు రైతులకు నీళ్లివ్వకుండా పోలవరానికి ప్రాణహిత పరుగులపై ప్రేక్షకపాత్ర పోషిస్తారని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

నీటిని ఎత్తిపోయకుండా రాజకీయాలు

తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కావాలంటే కచ్చితంగా రెండు తరాలు గడవాల్సిందే. కాంగ్రెస్ గొప్పగా చెప్పుకునే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆరు దశాబ్దాలైనా పూర్తి ఫలాలు అందించలేదు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఆ ప్రాజెక్టుకు సార్థకత వచ్చింది. అలాంటిది కేవలం మూడేండ్లలోనే ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరాన్ని కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పూర్తిచేశారు. భీకర వరద కారణంగా అందులో ఒక చిన్న భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో ఒక పిల్లర్ కుంగిపోయింది. రాజకీయాలు ఎలా ఉన్నా రైతుల శ్రేయస్సును కాంక్షించే ప్రభుత్వమైతే వెంటనే పునరుద్ధరిస్తుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం బరాజ్‌నే ఎండబెట్టింది. నీటిని ఎత్తిపోయకుండా ఆ సంఘటనను రాజకీయాలకు వాడుకుంటున్నది. ఈ క్రమంలో రెండు సీజన్లలో ప్రాణహిత జలాలను ఎత్తిపోయక పోవడంతో రెండు యాసంగి సీజన్లలో అనేక జిల్లాల్లో లక్షలాది ఎకరాల పంటలు ఎండిపోయాయి. చెరువులను నింపే దిక్కులేక భూగర్భజలాలు పడిపోయి జనం అరిగోస పడ్డారు. విచారణ కొనసాగిస్తూనే బరాజ్ పునరుద్ధరణ పనులు చేపట్టాలని బీఆర్ఎస్‌తో పాటు నిపుణులు సైతం ప్రభుత్వానికి సూచిస్తూనే ఉన్నా సర్కారు ససేమిరా అన్నది. అసెంబ్లీ ఎన్నికల్లో దీనిపై రాజకీయం చేసిన కేంద్రంలోని బీజేపీ ఎన్డీఎస్ఏతో ఏడాదిన్నర పాటు హైడ్రామా నడిపింది. దీన్ని అలుసుగా తీసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ సంస్థ నివేదికనే తమకు పరమావధిగా అన్నట్టు వ్యవహరించగా ఎన్డీఎస్ఏ ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తూ వచ్చింది. చివరికి రాష్ట్రంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభతో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం మారిపోయింది. ప్రజల్లో ఎక్కడ చూసినా ఇదే ఆసక్తి నెలకొనడంతో దాన్ని పక్కదారి పట్టించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హడావుడిగా ఎన్డీఎస్ఏ తుది నివేదికను బయటికి వదిలింది. కానీ బీఆర్ఎస్ సభ ముందు ఆ పాచిక పారలేదు. ఉన్న ఒక్క అస్త్రం విఫలం కావడంతో ఎన్డీఎస్ఏ చేతులెత్తేసింది.

అయోమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం

నిన్నటిదాకా ఎన్డీఎస్ఏను అడ్డం పెట్టుకొని మేడిగడ్డపై రాజకీయం నడిపిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అయోమయంలో పడింది. రాజకీయంగా తమనేదో గట్టున పడేస్తుందనుకున్న ఎన్డీఎస్ఏ ఇచ్చిన తుది నివేదిక అంతా డొల్ల అని తేలడంతో ప్రభుత్వ పెద్దలకు ఏమీ తోచలేదు. ఈ సమయంలోనే ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ లేఖ రూపంలో బాంబు పేల్చింది. 'నివేదికలో ఏమున్నది? కనీసం టెస్టులు చేయకుండానే నిర్మాణ, నాణ్యత లోపాలున్నాయని ఎలా తేలుస్తారు?' అని సూటిగా ప్రశ్నించడంతో సర్కారుకు దిమ్మతిరిగిపోయింది. ముఖ్యంగా ఇన్నాళ్లూ ఆ నివేదిక ఆధారంగానే మేడిగడ్డను పునరుద్ధరిస్తామంటూ చెప్తూ వచ్చిన ప్రభుత్వానికి అసలు ఆ దిశగా కార్యాచరణ లేకపోవడం గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. 'బరాజ్ పునరుద్ధరణకు మేమేం చేయాలి? ఎలా చేయాలి? ఎంత పరిమాణంలో చేయాలి? అనే రోడ్‌మ్యాప్ ఇవ్వాలి' అంటూ బంతిని ఎల్అండ్‌టీ సంస్థ ప్రభుత్వ కోర్టులోకి నెట్టేసింది. తామేదో రాజకీయంగా కాలయాపన చేయాలనుకుంటే చివరికి అది తమ మెడకే చుట్టుకుంటున్నదని ఆందోళన చెందిన ప్రభుత్వం హడావుడిగా మరో కమిటీని తెరపైకి తెచ్చింది.

ఎన్ని కమిటీలు... ఇంకెంత కాలం సాగదీస్తరు?!

ఇప్పుడు ఎన్డీఎస్ఏ కథ ముగిసింది. దీంతో రెండో ఎపిసోడ్‌కు కాంగ్రెస్ సర్కారు తెరలేపింది. మేడిగడ్డపై కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ ఏబీ పాండ్యా నేతృత్వంలో ఏడుగురు సభ్యుల కమిటీని వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రేపోమాపో ఆమోదం తెలపనున్నట్టు సమాచారం. ఇందులో మెంబర్ సెక్రటరీగా రామగుండం సీఈతో పాటు సభ్యులుగా గేట్ నిపుణుడు, వరంగల్ నీట్ ప్రొఫెసర్, ఎన్జీఆర్ఐ, రాక్ మెకానిక్, ఐఐటీ హైదరాబాద్, హైడ్రాలజీ నిపుణులను చేర్చింది. హడావుడి కమిటీ కావడంతో మరో ఇద్దరు ఆహ్వానిత సభ్యులంటూ 2 ఖాళీలు కూడా పెట్టింది. దీంతో మేడిగడ్డపై ఇప్పటివరకు కమిటీల సంఖ్య నాలుగుకు చేరినట్టు తెలుస్తున్నది. ఎన్డీఎస్ఏ ఒకటి కాగా జస్టిస్ ఘోష్ కమిటీ విచారణ ఓ వైపు కొనసాగుతూనే ఉన్నది. మరోవైపు కొంతకాలం కిందట ప్రభుత్వం నీటిపారుదల శాఖ ఈఎన్సీ నేతృత్వంలో సీడీవో, రామగుండం, ఆపరేషన్-మెయింటెనెన్స్ చీఫ్ ఇంజినీర్లతో కూడిన కమిటీని వేసింది. ఆ కమిటీ విచారణ చేసి కొన్ని పనులు చేపట్టింది. కమిటీ చేపట్టిన గ్రౌటింగ్ పనుల వల్లనే అక్కడ సాంకేతికంగా ఇబ్బంది కలిగిందని, అందుకే తాము పునరుద్ధరణ చర్యలపై ఏం తేల్చలేకపోతున్నామంటూ ఎన్డీఎస్ఏ ఓ సాకు వెతుక్కున్నది. ఇలా రైతులకు సాగునీరు అందించేందుకు మేడిగడ్డ పునరుద్ధరణ చేపట్టకుండా ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేసి రాజకీయంగా పబ్బం గడుపుకుంటున్నది. ఇదే అదునుగా చంద్రబాబు, మోదీ ప్రభుత్వం గోదావరి జలాలను తన్నుకుపోతున్నా తెలంగాణకు జరుగుతున్న చారిత్రక అన్యాయాన్ని మాత్రం నిలువరించడం లేదు. తాజాగా ప్రభుత్వం వేస్తున్న కమిటీ మేడిగడ్డ పర్యటనలంటూ మళ్లీ హడావుడి మొదలుపెట్టడం, విచారణల పేరిట నోటీసులు ఇవ్వడం, జలసౌధలో భేటీలు, నివేదిక.. ఇలా మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తకుండా రేవంత్ సర్కార్ ఇంకెంత కాలయాపన చేయనున్నదో కాలమే సమాధానం చెప్పాలి.

లోకం పోకడ



మీ శిష్యుడు దమ్మిడి లేదు, రాష్ట్రం దివాలా తీసింది అంటున్నాడు.. దానికి కారణం కూడా మీరే కాదా?

వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.1°c	23.9°c
రంగారెడ్డి	36.9°c	21.7°c
నిజామాబాద్	34.6°c	22.4°c
మెదక్	34.2°c	21.7°c
ఖమ్మం	34.0°c	26.0°c
వరంగల్	33.0°c	28.0°c
నల్లగొండ	33.0°c	25.0°c
కరీంనగర్	31.0°c	26.0°c
హైదరాబాద్	30.1°c	22.9°c
మహబూబ్‌నగర్	30.0°c	25.0°c



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత రాఘవ

'మేడిగడ్డ'కు తక్షణ మరమ్మతులు చేపట్టాలి

ఏబీ పాండ్యా కమిటీని స్వాగతిస్తున్నం

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లను నింపాలి

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ ప్రాజెక్టులో ఏర్పడిన పగుళ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రభుత్వానికి సూచించారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత రాఘవతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మరమ్మతులకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) రిపోర్టు అవసరమే లేదని గుర్తుచేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానిదే నిర్ణయాధికారమని, ప్రభుత్వమే మరమ్మతులు చేయొచ్చని మొదటి నుంచీ తాము చెప్తూనే ఉన్నామని తెలిపారు. ఇప్పుడు కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణ విషయంలో ఎలా ముందుకెళ్లాలనే అంశంపై ప్రభుత్వం కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ ఏబీ పాండ్యా నేతృత్వంలో నిపుణుల కమిటీ ఏర్పాటుచేయడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఈ కమిటీ ఎలాంటి జాప్యం చేయకుండా రిపేర్ పనులు ప్రారంభించాలని కోరారు. ఇప్పటికే మేడిగడ్డ వద్ద నిల్వ చేయకపోవడంతో నీళ్లన్నీ సముద్రం పాలయ్యాయని తెలిపారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు ఏమీ కాలేదని తేల్చి చెప్పారు. మేడిగడ్డ మూడు పిల్లర్లను మరమ్మతు చేసి, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో నీళ్లు నింపాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని వినోద్‌కుమార్ కోరారు.

తెలంగాణ తలసరిపై రు'బాబు'



- తన ఖాతాలో వేసుకునేందుకు చంద్రబాబు నాయుడు యత్నం
- తలసరి ఆదాయం పెరుగుదలకు తానే నాంది పలికాన్న ఏపీ సీఎం
- ఏపీని ఎందుకు అభివృద్ధి చేయలేదంటూ నెటిజన్ల ప్రశ్న

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ)/(స్పెషల్ టాస్క్ బ్యూరో): ఎక్కడ అభివృద్ధి జరిగినా 'అంతా నాదే' అని సొంత డబ్బా కొట్టుకునే ఏపీ సీఎం చంద్రబాబు.. ఇప్పుడు 'నాంది' రాగం అందుకున్నారు. హైదరాబాద్‌ను నేనే అభివృద్ధి చేశానంటూ కొన్నేండ్లుగా బిల్డప్ ఇస్తున్న చంద్రబాబు కన్ను ఇప్పుడు దేశంలోనే మొదటిస్థానంలో ఉన్న 'తెలంగాణ తలసరి ఆదాయం'పై పడింది. దానిని కూడా తన ఖాతాలో వేసుకునే కుట్రలు మొదలుపెట్టారు. కడపలో జరుగుతున్న మహానాడులో భాగంగా బుధవారం చంద్రబాబు మాట్లాడుతూ.. తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నదని, దానికి తానే నాంది పలికానని వ్యాఖ్యానించారు. ఒకవేళ చంద్రబాబు చెప్పేదే నిజమైతే ఆయన మంత్రం ఏపీలో ఎందుకు పనిచేయడం లేదని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. 2014 నుంచి ఐదేండ్లు చంద్రబాబు సీఎంగా ఉన్నారని, ఆయన హయాంలో ఏపీ ఎందుకు తెలంగాణతో పోటీ పడలేకపోయిందని నిలదీస్తున్నారు. కేసీఆర్ దూరదృష్టితో తెలంగాణలో పారిశ్రామిక, సామాజిక విప్లవం జరిగి ప్రజల జీవన ప్రమాణాలు, ఆదాయం పెరిగాయన్నది వాస్తవం. అయితే కేసీఆర్ క్రెడిట్‌ను బాబు తన ఖాతాలో వేసుకోవడం ఏమిటని తెలంగాణవాదులు, నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. బాబును చూస్తుంటే 'మందికి పుట్టిన బిడ్డను మనబిడ్డ అని ప్రచారం చేసుకునే' స్థాయికి దిగజారిపోయారని ఎద్దేవా చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు శకం 2004లోనే ముగిసిందని గుర్తు చేస్తున్నారు. ఆయన గద్దె దిగిన తర్వాత పదేండ్లకు ఏర్పడిన రాష్ట్ర అభివృద్ధిని కూడా తన ఖాతాలో వేసుకోవడాన్ని ఏమంటారో బాబుకే తెలియాలని ఎద్దేవా చేస్తున్నారు. ఈ లెక్కన ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబుకు ముందు, తర్వాత పాలించిన సీఎంలు కూడా తెలంగాణ అభివృద్ధిని తమ ఖాతాలో వేసుకోవచ్చుకదా? అని ప్రశ్నిస్తున్నారు.

ఆదాయంలో తేడాలు ఇలా..

తెలంగాణ తలసరి ఆదాయంపై బాబు చేస్తున్న ప్రచారం నిజమైతే.. ఆయన హయాంలో ఏపీ తలసరి ఆదాయం దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా రికార్డు సృష్టించాలి. కానీ వాస్తవాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. తలసరి ఆదాయంలో తెలంగాణను గడిచిన పదేండ్లలో ఎన్నడూ ఏపీ దాటలేకపోయింది. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ, ఏపీగా విడిపోయినప్పుడు తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం కొలువుదీరగా, ఏపీలో బాబు సీఎంగా ఉన్నారు. 2014 నుంచి 2019 వరకూ ఐదేండ్లలో కేసీఆర్‌పాలనలో తెలంగాణలో తలసరి రూ.1,07,222 పెరిగింది. ఏపీలో మాత్రం ఒక్కో పౌరుడి ఆదాయం రూ. 66,438 మాత్రమే పెరిగింది. అంటే ఏపీతో పోల్చితే తెలంగాణలో పెరిగిన తలసరి ఆదాయం రూ.40,784గా ఎక్కువ నమోదైంది. బాబు చెప్పిన 'నాంది' పలుకులే నిజమైతే.. ఏపీలో చంద్రబాబు వేసిన ఆర్థిక పునాదులతో ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం హయాంలో అయినా తలసరి ఆదాయంలో ఏపీ రికార్డులు సృష్టించాలి. తెలంగాణను దాటేయాలి. కానీ అదీలేదు. 2019-2024 మధ్య ఏపీలో ఒక్కో పౌరుడి తలసరి ఆదాయం రూ. 77,610 పెరుగగా, ఇదే సమయంలో తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఒక్కో పౌరుడి ఆదాయం రూ. 1,15,973 మేర పెరిగింది.

తలసరి ఆదాయంలో పెరుగుదల ఇలా..(రూ.ల్లో)

తెలంగాణ

సంవత్సరం	తలసరి	పెరుగుదల	వృద్ధిరేటు
2014-15	1,24,104	-	-
2019-20	2,31,326	1,07,222	86%
2023-24	3,47,299	1,15,973	50%

ఆంధ్రప్రదేశ్

సంవత్సరం	తలసరి	పెరుగుదల	వృద్ధిరేటు
2014-15	93,903	-	-
2019-20	1,60,341	66,438	70%
2023-24	2,37,951	77,610	48%

అంటే ఏపీలో కన్నా తెలంగాణలో రూ. 38,363 అధికంగా నమోదైంది. దీన్ని బట్టి తెలంగాణలో తలసరి ఆదాయం పెరగడానికి బాబుకు ఏ మాత్రం సంబంధం లేదని స్పష్టం అవుతున్నది. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొన్న ఆర్థిక విధానాలు, క్రమశిక్షణతో కూడిన చర్యలతోనే తెలంగాణ ఆదాయం పెరిగినట్టు అర్థం అవుతుంది. తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ అగ్ర స్థానంలో కొనసాగుతూ వస్తుండగా, బాబూ నేతృత్వంలోని ఏపీ కనీసం టాప్-3 ర్యాంకులో కూడా లేదు. 1995-1999, 2000-2004 మధ్య బాబు పాలనలో ఉమ్మడి ఏపీలోనూ పౌరుల తలసరి ఆదాయంలో కూడా గణనీయమైన మార్పులు ఏమీ జరుగలేదని ఈ సందర్భంగా పలువురు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని మానుకొని.. ఏపీలో ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని బాబుకు హితవు పలుకుతున్నారు.

తెలంగాణ అభ్యంతరాలు డోంట్‌కేర్

- అళగేశన్‌పై విచారణకు నిరాకరణ
- ఏకపక్షంగా గోదావరి బోర్డు మీటింగ్ మినిట్స్‌లోని అంశాలు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అభ్యంతరాలను గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) బేఖాతరు చేసింది. ఏప్రిల్ 7న నిర్వహించిన 17వ బోర్డు మీటింగ్‌కు సంబంధించిన మినిట్స్ తుది నివేదికను తాజాగా జీఆర్ఎంబీ విడుదల చేసింది. బోర్డు మెంబర్ సెక్రటరీ అళగేశన్‌పై వచ్చిన ఆరోపణల మీద విచారణ చేయించేందుకు కృష్ణా బోర్డు సభ్యులు చైర్మన్‌గా ఓ కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ కోరినా పట్టించుకోలేదు. రాష్ట్రం తరపున మెంబర్‌గా ఉన్న ఈఎన్సీ జనరల్ అనిల్‌కుమార్ ప్రతిపాదనలను కొట్టిపారేసిన బోర్డు.. గోదావరి బోర్డుకు సంబంధించిన అంశాల్లో వేరే బోర్డు సభ్యులను చైర్మన్‌గా కమిటీని వేయలేమని పేర్కొంది. దాని ప్రకారం మన అధికారులు పేర్కొన్న ఎజెండా అంశాలను చర్చించేందుకు నిరాకరించింది. అనుమతి లేని అంశాలను బోర్డులో చర్చించేందుకు తెలంగాణ ప్రయత్నించిందని రివర్స్‌లో ఆరోపించింది. అవసరమైతేనే కమిటీని వేస్తామని చెప్పినట్టు మినిట్స్‌లో రాసుకుంది.

నిబంధనలకు అనుగుణంగానే

బోర్డులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకానికి సంబంధించి కేంద్రం రూల్స్ పాటిస్తామని మినిట్స్‌లో బోర్డు చైర్మన్ వెల్లడించారు. సెక్యూరిటీ, క్లీనింగ్ సిబ్బంది సేవలను ఉపసంహరించుకుంటున్నట్టు తెలిపారు. గోదావరిపై ఉమ్మడి ప్రాజెక్టు పెద్దవాగు ఒక్కటేనని, దానిని ఇచ్చేందుకు అభ్యంతరం లేదని తెలంగాణ పేర్కొన్నట్టు మినిట్స్‌లో వెల్లడించారు. మిగతా ప్రాజెక్టులను ఇచ్చేది లేదని స్పష్టం చేసినట్టు వివరించారు. ఏపీ మాత్రం ప్రాజెక్టులను అప్పగించేందుకు ఓకే చెప్పిందన్నారు. అయితే, ఏపీ మాత్రం మన ప్రాజెక్టులపై మెలికలు పెట్టినట్టు మినిట్స్‌లో స్పష్టమైంది. అన్ని పవర్ ప్రాజెక్టులూ ఏపీ భూభాగంలోనే ఉన్నాయని, తెలంగాణలో ఏమీ లేవని, కాబట్టి దీనిపై తెలంగాణకు ఏ సంబంధమూ లేదని మినిట్స్‌లో పేర్కొన్నారు.

ఏపీ అధికారులకు ప్రయారిటీ

ఏపీ ఉద్యోగులకు అర్హత లేకున్నా బోర్డు ప్రమోషన్లు కల్పించింది. ఇన్‌చార్జి ఎస్ఈగా పని చేస్తున్న ఏపీ అధికారి ఆర్ శ్రీకాంత్‌రెడ్డికి పూర్తిస్థాయి ఎస్ఈగా బాధ్యతలు అప్పగిస్తున్నట్టు పేర్కొంది. బోర్డు రూల్స్ ప్రకారం రెండేండ్లు ఇన్‌చార్జి ఎస్ఈగా పనిచేస్తే.. పూర్తిస్థాయి ఎస్ఈగా నియమించేందుకు అవకాశం ఉందని పేర్కొంది. ఏపీ కేడర్ డీఈఈ ఎం వేణుగోపాల్ అనే మరో అధికారికి ఈఈగా అవకాశం కల్పించింది. మన అధికారుల విషయంలో మాత్రం కొర్రీలు పెడుతున్నది. సిబ్బంది కొరత దృష్ట్యా పలువురు అధికారుల డిప్యూటేషన్‌ను పెంచాలని ఈఎన్సీ లేఖ రాసినా బోర్డు కొట్టిపారేసింది.

బొంకుల బాబు బడాయి

మొదటిపేజీ తరువాయి...

బుధవారం ఏపీలోని కడపలో జరిగిన మహానాడులో మాత్రం తాను కాళేశ్వరం ప్రాజెక్టును వ్యతిరేకించలేదంటూ అబద్ధం ఆడారు. 'ప్రజలకు జ్ఞాపకశక్తి తక్కువ! నేను ఏం చెప్పినా నడుస్తుందిలే..' అనేది ఆదినుంచీ చంద్రబాబు నైజం. చివరకు తాను ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్నప్పుడు శంకుస్థాపన చేసిన దేవాదుల ప్రాజెక్టుపై కూడా తానే ఫిర్యాదు చేసిన చరిత్ర చంద్రబాబుది.

బనకచర్ల కోసం కొత్త డ్రామా

గతంలో ఏపీ సీఎంగా తెలంగాణ ప్రాజెక్టులపై విషం చిమ్మిన చంద్రబాబు, ఇప్పుడు బనకచర్ల కోసం కొత్త డ్రామాకు తెరలేపారు. కేంద్రంలో చక్రం తిప్పుతూ మేడిగడ్డను పడావు పెట్టడంలో తనదైన పాత్ర పోషించిన ఆయన తాజాగా కాళేశ్వరం ప్రాజెక్టు మీద ప్రేమ ఒలకబోస్తున్నారు. తాను ఎన్నడూ ఆ ప్రాజెక్టును వ్యతిరేకించలేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై తెలంగాణవాదులు మండిపడుతున్నారు. పోలవరం కోసం ఐదు మండలాలను ఏపీలో కలపాలని, అప్పటివరకు తాను సీఎంగా ప్రమాణ స్వీకారం చేసేదిలేదంటూ కేంద్రం ముందు షరతు పెట్టిన బాబు.. ఇప్పుడు గోదావరి జలాలను తన్నుకుపోయేందుకు నీతి వాక్యాలు వల్లిస్తున్నారు. కొత్త రాష్ట్రం... ఉమ్మడి రాష్ట్రంలో నదీజలాల్లో తీవ్ర అన్యాయానికి గురైన ప్రాంతం కావడంతో ఏడాదిపాటు మథనం చేసిన కేసీఆర్... 2015లో రీడిజైనింగ్‌ను పట్టాలెక్కించేందుకు సిద్ధమయ్యారు. ఇక అంతే! 2015లో కేంద్రంతోపాటు నదీ యాజమాన్య బోర్డులకు ఫిర్యాదు లేఖలను మొదలుపెట్టిన బాబు అండ్ కో 2019 ఎన్నికల్లో ఓటమి చెందే వరకు విషం చిమ్ముతూనే ఉన్నా రు. కృష్ణాపై నిర్మిస్తున్న పాలమూరు-రంగారెడ్డి, డిండి, కల్వకుర్తి... చివరకు చిన్న లిఫ్టు స్కీం అయిన తుమ్మిళ్లను సైతం వదల్లేదు. ఖమ్మం జిల్లాలో స్థిరీకరణ కోసం చేపట్టిన భక్త రామదాసు లిఫ్టు స్కీం కూడా చంద్రబాబు చూపు నుంచి తప్పించుకోలేకపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టును తాను వ్యతిరేకించలేదంటూ ఇప్పుడు చిలుకపలుకులు పలుకుతున్న చంద్రబాబు... అనేకసార్లు అది కొత్త ప్రాజెక్టు, అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేనిదే ఎలా అనుమతిస్తారంటూ కేంద్రానికి ఫిర్యాదులు పంపారు. సముద్రంలోకి వృథాగా పోయే నీళ్లే కదా... అని బనకచర్ల విషయంలో నీతులు వల్లిస్తున్న ఆయన 13.6.2018న కాళేశ్వరంపై చేసిన ఫిర్యాదులో 'ఎగువ రాష్ట్రాల వినియోగాన్ని లెక్కల్లోకి తీసుకోకుండా కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎలా అనుమతులు ఇస్తారు?' అని కేంద్రాన్ని ప్రశ్నించారు. మరి ఇదే బనకచర్ల విషయంలో ఎగువ రాష్ట్రమైన తెలంగాణ వినియోగాన్ని పట్టించుకోకపోవడం చంద్రబాబు అబద్ధాలను ఎంత సులువుగా ఆడతారో స్పష్టంచేస్తున్నది. అంతేకాదు, కాళేశ్వరం ప్రాజెక్టుకు ట్రిబ్యునల్ కేటాయింపులు ఉన్నాయా? ఆంధ్రప్రదేశ్‌తో ఒప్పందం జరిగిందా? అని కూడా అదే లేఖలో ప్రశ్నించారు. మరి అదే బనకచర్లకు మాత్రం ఇవేవీ పట్టడం లేదు.

కొసమెరుపు

చంద్రబాబు తమ పార్టీ ఎంపీ సీఎం రమేశ్‌తోనూ రాజ్యసభలో ఫిర్యాదుల రూపంలో ప్రశ్నలు కూడా వేయించారు.

ఎంపీ సీఎం రమేశ్ వేసిన ప్రశ్న: కేంద్ర జల సంఘంతో డీపీఆర్‌లను ఆమోదించుకోకుండానే పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేసిన తెలంగాణ ప్రభుత్వం.. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్లు 84(3), 85(8)(డీ), పదకొండో షెడ్యూల్‌లోని పారా-7ను ఉల్లంఘించినట్టుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఫిర్యాదు అందిందా? అందితే.. ఆ ప్రాజెక్టుల నిర్మాణాన్ని నిలిపివేసేందుకు కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ ఎలాంటి చర్యలు తీసుకున్నది?

కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ సన్వర్‌లాల్ జాట్ ఇచ్చిన సమాధానం: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ రెండు ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జల సంఘానికి ఫిర్యాదు చేసింది. అయితే, వీటికి సంబంధించి కేంద్రానికి ఎలాంటి సాంకేతిక-ఆర్థిక అంచనాలు (టెక్నో-ఎకనామికల్ అప్రైసల్) అందలేదు. మరోవైపు, తెలంగాణ ప్రభుత్వం 22.8.2015న స్పష్టంగా ఒక లేఖ కూడా రాసింది. అందులో ఈ రెండు ప్రాజెక్టులు కొత్తవి కావని, అపాయింటెడ్ తేదీ తర్వాత చేపట్టలేదని స్పష్టం చేసింది. దీంతో ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట ఉల్లంఘన అనేది జరగలేదు.

మంత్రివర్గంలో ఫిర్యాదులకు ఆమోదం

ఒక రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పొరుగు రాష్ట్ర ప్రాజెక్టులపై ఫిర్యాదులు చేయాలనే ఎజెండాను చేర్చి ఆమోదించిన ఘనత చంద్రబాబుకు దక్కింది. 2016లో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి మేడిగడ్డ వద్ద అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. దాన్ని జీర్ణించుకోలేని అప్పటి ఏపీ సీఎం చంద్రబాబు ఏకంగా మంత్రివర్గ సమావేశంలో తెలంగాణ చేపడుతున్న ప్రాజెక్టులపై ఫిర్యాదులు చేయాలని చర్చించి, తీర్మానం చేశారు. అంతేకాదు, ఉమ్మడి ఏపీలో కేసీఆర్ ప్రారంభించిన తెలంగాణ ఉద్యమ వేడికి తట్టుకోలేక చంద్రబాబు దేవాదుల ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలను మభ్య పెట్టేందుకు దారి లేని ప్రాంతానికి హెలికాప్టర్‌లో మేస్త్రీని ఎక్కించుకొని వెళ్లి హడావుడిగా శంకుస్థాపన చేశారు. అసలు నీటి నిల్వ లేకుండా చేపట్టిన ఆ ప్రాజెక్టును అటకెక్కించకుండా, వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కేసీఆర్ 2015 ఆగస్టు, 18న దేవాదుల ఇన్‌టేక్ పాయింట్ దిగువన 2.5 కిలోమీటర్ల ప్రాంతంలో ఒక బరాజ్ నిర్మాణానికి సర్వే కోసం జీవో 607 జారీ చేశారు. ఆ జీవోపై కూడా చంద్రబాబు ఫిర్యాదు చేసి తెలంగాణపై తనకున్న విషాన్ని వెళ్లగక్కారు.

'బనకచర్ల'తో తెలంగాణకు తీరని అన్యాయం

అనుమతుల్లేకుండా ప్రాజెక్టు పనులు

ఏపీ సీఎం చంద్రబాబు మరో ద్రోహం

మౌనం వహిస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారు

బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ ధ్వజం



హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): ఎలాంటి అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆందోళన వ్యక్తంచేశారు. గోదావరి నదిపై ప్రాజెక్టులను ఎన్నడూ తాను అడ్డుకోలేదన్న ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు హస్యాస్పదమని పేర్కొన్నారు. గోదావరిపై అన్ని అనుమతులు సాధించిన కాళేశ్వరం ప్రాజెక్టును ఒకవైపు అడ్డుకుంటూ, భక్త రామదాసు ప్రాజెక్టు పనులనూ ఆపాలని కేంద్రానికి లేఖ రాశారని ఆయన గుర్తుచేశారు. అలాగే పాలమూరు రంగారెడ్డి-ఎత్తిపోతల పథకాన్ని కూడా అడ్డుకున్న చంద్రబాబు.. ఇప్పుడేమో నీతులు వల్లిస్తున్నాడని దుయ్యబట్టారు. రెండుకండ్ల సిద్ధాంతంతో చంద్రబాబు మరో సారి తెలంగాణకు ద్రోహం చేసే కుట్రకు తెరలేపారని మండిపడ్డారు. తెలంగాణ నదీజలాలు చంద్రబాబు తరలించుకు పోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం మౌనంగా ఉండటం సిగ్గుమాలిన వ్యవహారం అని పేర్కొన్నారు.